భూసేకరణ వేగవంతం చేయాలి

- నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

నారాయణపేట టౌన్, జూలై 25: పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నీటి పారుదల శాఖపై సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో 57.44 ఎకరాల భూ సేకరణ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, 82.35 ఎకరాల భూ సేకరణకు సంబంధించిన డబ్బులు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నారాయణపేట పరిధిలో ఉన్నాయన్నారు. జూరాల డ్యాం పునరావాస కేంద్రాలు మక్తల్ మండలంలోని అనుగొండ, అంకెన్‌పల్లి, ధాదన్‌పల్లి భూ సేకరణ డబ్బులు త్వరలోనే వచ్చే అవకాశముందన్నారు. సమావేశం లో డీఎస్ బాలరాజు తదితరులున్నారు.

విలాసాల కోసం చోరీలు

స్వాధీనం చేసుకున్న సొమ్ముతో ఎస్పీ యోగేశ్ గౌతమ్

- నిందితుడిని పట్టుకున్న పోలీసులు
- 75.1 తులాల బంగారం, 35తులాల వెండి, రూ.4లక్షలు స్వాధీనం
- గతంలో జైలుశిక్ష పడినా మారని తీరు

నారాయణపేట, జూలై 25: విలాసాలకు అలవాటు పడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన నిందితుడిని గురువారం పోలీసులు రిమాండ్ తరలించారు. గురువారం తన కార్యాలయంలో ఎస్పీ యోగేశ్ గౌతమ్ విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం చేపనపేట గ్రామానికి చెందిన అప్పలనాయుడు కారు డ్రైవింగ్ చేసేవాడు. విలాసాలకు అలవాటు పడి వరుస చోరీలు చేస్తూ వచ్చిన సొమ్ముతో పేకాట ఆడడం, షార్ట్ ఫిల్మ్‌లు తీయడం, డబ్బులు అయిపోయాక మళ్లీ చోరీలకు పాల్పడడం పరిపాటి గా మారింది. ఈ క్రమంలోనే ఐదునెలల కిందట జిల్లాలోని మక్తల్, మరికల్, నారాయణపేటలో ఆరుచోట్ల చోరీ జరిగింది. దీంతో కేసులు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గురువారం మక్తల్‌లో పోలీసులు చేపట్టిన తనిఖీల్లో అప్పలనాయుడు పట్టుబడ్డాడు. ఆరు చోరీలకు సంబంధించిన 75.1 తులాల బంగారం, 35 తులాల వెండి, రూ.4లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ ప్రాంతాల్లో పలుచోరీ కేసుల్లో నిందితుడిగా జైలు శిక్ష అనుభవించి, 2021లో జైలు నుంచి విడుదలయ్యాడు. తిరిగి చోరీలు చేయడం ప్రారంభించాడు. డీఎస్పీ లింగయ్య పర్యవేక్షణలో నిందితుడిని పట్టుకునేందుకు కృషి చేసిన మక్తల్, మరికల్ సీఐలు చంద్రశేఖర్, రాజేందర్‌రెడ్డి, ఎస్సైలు భాగ్యలక్ష్మిరెడ్డి, మురళి, కానిస్టేబుళ్లు రవీంద్రనాథ్, తిరుపతిరెడ్డి, నరేశ్‌యాదవ్, అశోక్‌కుమార్, శ్రీకాంత్, ఐటీ కోర్ శ్రీనివాసులును ఎస్పీ అభినందించి, రివార్డు అందజేశారు.

స్టేట్ హోమ్‌ను సందర్శించిన జిల్లా కార్యదర్శి

మహబూబ్‌నగర్, జూలై 25: జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డలో గల స్టేట్ హోమ్, శిశుగృహ, చైల్డ్ హోమ్‌ను గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఇందిర తనిఖీ చేశారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి పాపిరెడ్డి ఆదేశాల మేరకు స్టేట్ హోమ్‌లో వసతులను పరిశీలించారు. నీరు, ఆహారం పరిశుభ్రంగా ఉండాలని, ఈగలు, దోమలు రాకుండా శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. అనంతరం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.

మరికల్ తాసీల్దార్‌గా జమీల్

మరికల్, జూలై 25: మరికల్ మండల నూతన తాసీల్దార్‌గా జమీల్ గురువారం బాధ్యతలు చేపట్టారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న సునీత వనపర్తి జిల్లాకు బదిలీపై వెళ్లారు.

మిడ్జిల్ ఎస్సైగా శివనాగేశ్వర్‌నాయుడు

మిడ్జిల్, జూలై 25: మిడ్జిల్ ఎస్సైగా శివనాగేశ్వర్‌నాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. భూత్పూర్ ఎస్సై–2గా పనిచేస్తున్న ఈయన బదిలీపై మిడ్జిల్ వచ్చారువచ్చారు.

JAYAPRAKASH NARAYAN COLLEGE OF ENGINEERING
(UGC Autonomous Institution, Accredited by NAAC, Affiliated to JNTUH, Approved by : AICTE & Govt. of Telangana) Mahabubnagar-509001

TGECET-2024 B.Tech II year (Lateral Entry) Institutional Spot Admissions on 30.07.2024

Vacancies in AI&ML, CIVIL, EEE, MECH & ECE. Eligible candidates can attend the spot admissions along with all original certificates. Admissions will be made as per the guidelines of the Convenor, **TGECET-2024.** For further Details Contact: **8886680017/25**
Date: 25/07/2024 **PRINCIPAL**

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

డాక్యుమెంట్ పోయినది
పుడుతల భాస్కర్ తండ్రి లేట్ జంగా రావు, వయస్సు: 53, నివాసము: ఇంటి నెం. 1-5-73/2/బి, న్యూటౌన్, మహబూబ్‌నగర్ జిల్లా గారి సర్వే నెం. 565/ఈ విస్తీర్ణం ఎ.0.30 గుంటలు (పాస్ బుక్ నం. టి01020011634, ఖాతా నెం.2663) పత్రాలు కలిగి ఉన్న అగ్రికల్చర్ ఆస్తికి సంపూర్ణ యజమాని, సాధారణ ప్రజలకు దీని ద్వారా తెలియజేయునది ఏమనగా, సర్వే నెం.565/ఈ, విస్తీర్ణం ఎ.0.30 గుంటలు (పాస్ బుక్ నం. టి01020011634, ఖాతా నెం.2663) ఒరిజినల్ డాక్యుమెంట్స్ నెం.1830/2021 వారం రోజుల క్రితం పోయినది. కావున ఎవరికైన దొరికినచో అట్టి ఒరిజినల్ డాక్యుమెంట్ కాపీలను ఈ క్రింది అడ్రస్‌కు పంపగలరు.
పుడుతల భాస్కర్ తండ్రి లేట్ జంగా రావు, వయస్సు: 53, నివాసము: ఇంటి నెం.1-5-73/2/బి, న్యూటౌన్, మహబూబ్‌నగర్ జిల్లా గారి సెల్ నెం. 9346794570.

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

ప్రణాళికతో చదవాలి

- విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి
- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి

వడ్డెమాన్ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

దేవరకద్ర రూరల్(చిన్నచింతకుంట), జూలై 25 : విద్యతోనే మార్పు సాధ్యమని, ప్రణాళికతో చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం చిన్నచింతకుంట మండలంలో ఆమె పర్యటించారు. ముందుగా దమగ్నాపూర్‌లో గురుకుల పాఠశాలల భవన నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం వడ్డెమాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పేదరికం చదువుకు అడ్డుకారాదని, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం మహిళా సంఘాలతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో తాసీల్దార్ కృష్ణయ్య, ఎస్సై శేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలకు స్థల పరిశీలన

దేవరకద్ర, జూలై 25 : దేవరకద్రతోపాటు బల్సుపల్లిలో ప్రభుత్వ భూములను మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిరబోయి గురువారం పరిశీలించారు. 100 పడకల దవాఖాన భవన నిర్మాణంతోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం మండల కేంద్రంలోని 127 సర్వేనెంబర్‌లో ప్రభుత్వ భూమితోపాటు, బల్సుపల్లిలోని 90 సర్వేనెంబర్‌లో 40ఎకరాలను పరిశీలించారు. తాసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ శరత్, ఎంపీవో శ్రీనివాసులు, ఈవో సీతానాయక్ ఉన్నారు.

ఘనంగా ఓరియంటేషన్ కార్యక్రమం

పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న కళాశాల బృందం

పాలమూరు,జూలై25:మహబూబ్‌నగర్‌లోని శ్రీ వాసవీ డిగ్రీ కళాశాలలో గురువారం డిగ్రీ మొదటి సంవత్సరంలో కొత్తగా చేరినవ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని కలిగి ఉండాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసయ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. డైరెక్టర్ రజినీకాంత్ మాట్లాడుతూ సమయాన్ని వృధా చేయకుండా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొండస్వామి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు రావాలని ఆహ్వానం

ఆహ్వాన పత్రికను అందజేస్తున్న గ్రామస్తులు

భూత్పూర్, జూలై 25 : మండలంలోని కప్పెటలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవానికి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని గ్రామస్తులు ఆహ్వానించారు. గురువారం మాజీ వైస్ ఎంపీపీ నరేశ్‌గౌడ్ తోపాటు గ్రామస్తులు హైదరాబాద్‌లోని స్వగృహానికి వెళ్లి ఆహ్వానపత్రికను అందజేశారు. ఆగస్టు 7,8,9 తేదీల్లో ఆలయ ప్రారంభ పూజలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, కుర్మయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నెలలు నిండని కవలలకు అరుదైన చికిత్స

- సుశ్రుత ప్రజా వైద్యశాలలో మెరుగైన వైద్యం

కవలలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న డాక్టర్ ప్రియాంక

మహబూబ్‌నగర్, జూలై 25: నెలలు నిండకుండా ఏడు నెలల్లో పుట్టిన కవలలకు సుశ్రుత ప్రజా వైద్యశాలలోని నియోనేటల్ బేబీ కేర్ యూనిట్‌లో మెరుగైన చికిత్స అందించి, సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించామని డాక్టర్ ప్రియాంక తెలిపారు. గురువారం ప్రజావైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చికిత్స వివరాలు తెలిపారు. నవాబ్‌పేట మండలం మరికల్‌కు చెందిన దంపతులు బాలరాజు, సుమతి. సుశ్రుత ప్రజావైద్యశాలలో ఈఏడాది మే 13న సుమతికి (ఏడు నెలలకే) కవలలు జన్మించారు. పాప 800గ్రాములు, బాబు కేజీ బరువుతో పుట్టడంతో ఆరోగ్య పరిస్థితి విషమంగా మారింది. దీంతో ఎన్‌ఐసీయూలో వెంటిలేటర్‌పై 12రోజులు కృత్రిమ శ్వాస అందించామన్నారు. అనంతరం పరిస్థితి కాస్త మెరుగవడంతో కంగారు మదర్ కేర్‌లో తల్లిపాలు అందించామన్నారు. ఇలా 72రోజుల పాటు ఆరోగ్య శ్రీలో ఉచితంగా వైద్యసేవలు అందించి, చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. ఈసందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులు డాక్టర్ ప్రియాంక, యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గంజాయితో పట్టుబడిన ఇద్దరికి రిమాండ్

మహబూబ్‌నగర్, జూలై 25: అక్రమంగా ఎండు గంజాయి నిల్వ చేసుకొని సేవిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మహబూబ్‌నగర్ ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి గురువారం తెలిపారు. పట్టణంలోని ఏనుగొండ సమీపంలోని వివేకానంద కాలనీలో ఈ వ్యవహారానికి సంబంధించిన సమాచారం అందడంతో దాడులు నిర్వహించగా, ఓ ఇంట్లో వివేకానంద కాలనీకి చెందిన వేణు, ఏనుగొండకు చెందిన ప్రకాశ్ గంజాయి సేవిస్తూ పట్టుబడ్డారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై సుధాకర్‌రెడ్డి, ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ కళానందమ్, కానిస్టేబుల్ వేణుగోపాల్, వినోద్‌కుమార్, సుధారాణి, రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు. గంజాయితో పట్టుబడితే తాసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి రూ.2లక్షలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

వీరారెడ్డి సేవలు మరువలేనివి

మరికల్, జులై 25: మాజీ ఎమ్మెల్యే, మాజీ ఆప్కాబ్ చైర్మన్ కె.వీరారెడ్డి సేవలు మరువలేనివని డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. మరికల్‌లో చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాఠశాల పనుల్లో జాప్యం తగదు

- అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

కేజీబీవీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

మిడ్జిల్, జూలై 25: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో జాప్యం పై అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీ, అయ్యవారిపల్లి, వేముల ప్రభుత్వ పాఠశాలల్లో పనులను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశిన గడువులోపు పనులు పూర్తి చేయకపోవడంతో కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడారు. అయ్యవారిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో మొక్కలు నాటారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో గీతాంజలి, అధికారులు ఉన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

- అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్

వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్

నారాయణపేట టౌన్, జూలై 25: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ అన్నారు. గురువారం సింగారం చౌరస్తా వద్ద ఉన్న దామరగిద్ద మండల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలతో పాటు దామరగిద్ద మండల కేజీబీవీ సిబ్బందికి ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన సందర్శించారు. మందులను పరిశీలించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ గరిమా నరుల, డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మీ, జీసీడీవో పద్మనళిని ఉన్నారు.

లక్ష్య సాధనకు కష్టపడి చదవాలి

దామరగిద్ద, జూలై 25: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని లక్ష్య సాధనకు కష్టపడి చదవాలని అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ సూచించారు. గురువారం దామరగిద్ద కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. డిజిటల్ తరగతుల బోధనను పర్యవేక్షించి, స్వయంగా బోర్డుపై అంక్షాంశాల గురించి వివరించారు. అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ గరిమా నరులా, సీడీపీవో పద్మనళిని ఉన్నారు.

ప్రజా వ్యతిరేక బడ్జెట్

నారాయణపేట, జూలై 25: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా పేదల, రైతు వ్యతిరేక బడ్జెట్ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సాగర్ విమర్శించారు. గురువారం పట్టణంలోని వీరసావర్కర్ చౌరస్తా వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. బడ్జెట్‌లో పాలమూరు– రంగారెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టులకు, బయ్యారం ఉక్కు కర్మాగారానికి ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా రైతులకు, కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. సాధారణ ప్రజానీకానికి పన్నులు పెంచి, భారం మోపిందన్నారు. అంతకుముందు పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

మహబ్బత్‌అలీషా దర్గా ఉర్సు

జడ్చర్లలో గుర్రాలపై గంధంతో ఊరేగింపు

జడ్చర్ల, జూలై 25 : జడ్చర్ల మున్సిపాలిటీలోని హౌసింగ్‌బోర్డు కాలనీ సమీపంలో గల కొశ్యగుట్టపై గల మహబ్బత్‌అలీషా దర్గా వద్ద గురువారం గంధోత్సవం నిర్వహించారు. కావేరమ్మపేట నుంచి గంధంతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మహబ్బత్‌అలీషా దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి, ప్రసాదం అందరికీ పంచారు.

ఉన్నత లక్ష్యంతో చదవాలి

మరికల్, జూలై 25: ప్రతి విద్యార్థి ఒక లక్ష్యంతో ముందుకుసాగాలని మరికల్ ఎస్సై మురళి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో రిటైర్డ్ హెచ్ఎం రాంప్రకాశ్‌గుప్తా మోడి శెట్టి అవార్డులను 9మంది విద్యార్థులకు ప్రతిభ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ హన్మంత్‌రెడ్డితో కలిసి రూ.5వేల చొప్పున చొప్పున అందించారు.

కారు, లారీ ఢీకొని ఒకరు మృతి

కృష్ణ, జూలై 25 : లారీ, కారు ఢీ కొనడంతో కారులో ప్రయాణిస్తున్న మహిళ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని కున్సి గ్రామ సమీపాన గురువారం సాయంత్రం 7.15 గంటల సమయంలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాలు.. బళ్లారి నుంచి గుల్బర్గా వెళ్తున్న కారు లాతూర్ నుంచి కోలార్‌కు వెళ్తున్న లారీ కున్సి గ్రామ సమీపంలో ఢీ కొన్నాయి. కారులో ఉన్న విమల(66) అక్కడికక్కడే మృతి చెందగా, భర్త సురేశ్ (70)కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందడంతో పోలీసులు వారిని రాయిచూర్ రిమ్స్ దవాఖానకు తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నాన్‌టీచింగ్ సిబ్బందికి వైద్య పరీక్షలు

మక్తల్, జూలై 25: మక్తల్ కస్తుర్బాగాంధీ పాఠశాలలో నాన్ టీచింగ్ సిబ్బందికి గురువారం సాయంత్రం వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశామని డాక్టర్ విరోజా తెలిపారు.

ఘనంగా భవనమ్మ బోనాలు

నవాబ్‌పేట, జూలై 25: మండలంలోని ఇప్పటూర్‌లో గురువారం భవనమ్మ బోనాలు నిర్వహించారు. అలంకరించిన ఎద్దుల బండ్లు, వాహనాలను అమ్మవారి ఆలయం చుట్టూ ఊరేగించారు. మహిళలు బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు, పూజలు చేసి, మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో నాయకులు భూపాల్‌రెడ్డి, దుబ్బ రవికిరణ్, నవనీతరావు, ప్రకాశ్, నర్సింహరెడ్డి ఉన్నారు.

ఘనంగా ఎర్రసత్యం జయంతి

జడ్చర్ల, జూలై 25: జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే దింవగత ఎర్రసత్యం జయంతి వేడుకలను గురువారం జడ్చర్లలో ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్‌చౌక్‌లో మాజీ ఎమ్మెల్యే ఎం.సత్యనారాయణ(ఎర్రసత్య) చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బీసీసేన ఆధ్వర్యంలో..

బీసీసేన కార్యాయంలో ఎర్రసత్యం చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఆయన జ్ఞాపకార్థం జడ్చర్లలో బస్‌డిపో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

బాల్యవివాహాలతో జీవితం అంధకారం

నారాయణపేటరూరల్, జూలై 25: బాలికలు బాల్యవివాహాలు చేసుకుంటే జీవితం అంధకారమవుతుందని చైల్డ్ హెల్ప్‌లైన్ డిస్ట్రిక్ కోఆర్డినేటర్ నర్సింహులు అన్నారు. గురువారం జాజాపూర్ ఉన్నత పాఠశాలలో ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.

పాఠశాలల నిర్వహణ గ్రాంట్‌ల ఆడిట్

నారాయణపేటరూరల్, జూలై 25 : పేట జిల్లా కేంద్రంలోని మండల వనరుల కేంద్రంలో జిల్లాలోని పలు మండలాలకు సంబంధించిన నిర్వహణ గ్రాంట్‌ల ఆడిట్ గురువారం నిర్వహించారు. హైదరాబాద్ నుంచి ఆరుగురు ప్రత్యేకాధికారుల బృందం ఆడిట్ నిర్వహించింది. వివిధ పాఠశాలల హెచ్ఎంలు తమ పాఠశాలల 2023–24 గ్రాంట్‌లకు సంబంధించిన రికార్డులను ఆడిట్ చేయించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), జూలై 25 : కౌకుంట్ల మండలం ముచ్చింతలకు చెందిన వెంకటన్న అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న న్యాయవాది మన్యం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

ఉద్యాన పంటల సాగుతో లాభాలు

ఊట్కూర్, జూలై25 : ఉద్యానవ పంటల సాగుతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సాయిబాబా అన్నారు. గురువారం మండలంలోని అమీన్‌పూర్ రైతువేదిక వద్ద రైతులకు పండ్లు, కూరగాయలు, ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు.

రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు

మూసాపేట, జూలై 25 : వ్యక్తులను, పార్టీలను కించపరిచేలా, రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే వారితోపాటు గ్రూప్ అడ్మిన్లపై చర్యలు తీసుకుంటామని మూసాపేట ఎస్సై శ్రీనివాసులు, అడ్డాకుల ఎస్సై శ్రీనివాసులు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

నేడు కోయిల్‌సాగర్ ఆయకట్టుకు నీటి విడుదల

దేవరకద్ర, జూలై 25 : కోయిల్‌సాగర్ ఆయకట్టుకు వానకాలం సాగు కోసం నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల కింద వరిసాగు కోసం నీటి విడుదల ఉంటుందన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి నీటిని విడుదల చేస్తారన్నారు.

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కృష్ణ, జూలై 25: కృష్ణానదికి ఎగువనుంచి రోజురోజుకూ వరద పెరుగుతున్నదని, నదీతీర ప్రాంత ప్రజలతో పాటు అన్నిగ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాసీల్దార్ దయాకర్‌రెడ్డి తెలిపారు. చేపల వేటకు, జీవాలను మేపడానికి, ఇతర అవసరాలకు నదివైపు వెళ్లరాదని సూచించారు. గ్రామాల్లో ఏ ఇబ్బంది ఏర్పడినా రెవెన్యూ సిబ్బందికి, పోలీస్ శాఖ డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు.

నేడు, రేపు గురుకుల స్పాట్ అడ్మిషన్లకు కౌన్సెలింగ్

పాలమూరు, జూలై 25: మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, ఒకేషనల్ గ్రూప్‌లో ప్రవేశానికి ఈనెల 26, 27 తేదీల్లో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహిస్తున్న గురుకులాల ప్రాంతీయ సమన్వయ అధికారి ఫ్లారెన్స్‌రాణి తెలిపారు. బాలికలకు 26న రాంరెడ్డిగూడలో, 27వ తేదీన జయప్రకాశ్‌నగర్‌లో ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు.

డీఎస్సీ పరీక్షకు 665మంది హాజరు

పాలమూరు, జూలై 25: మహబూబ్‌నగర్‌లోని ఫాతిమా విద్యాలయం, జయప్రకాశ్ నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో డీఎస్సీ పరీక్షకు మొదటి షిఫ్ట్‌లో 325మంది హాజరు కాగా, రెండో షిఫ్ట్‌లో 340మంది హాజరయ్యారు. కేంద్రాల వద్ద పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

డిగ్రీ అడ్మిషన్లకు దోస్త్ ప్రత్యేక అవకాశం

పాలమూరు, జూలై 25: డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లకు దోస్త్ ప్రత్యేక దశ ద్వారా దోస్త్ నమోదు చేసుకున్న, సీటు పొందలేని విద్యార్థులకు ఈనెల 25నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ప్రత్యేక అవకాశం కల్పిస్తున్నట్లు ఎన్టీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.విజయ్‌కుమార్ తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ రూ.400 రుసుము చెల్లించి నమోదు చేసుకోవాలని సూచించారు. 27 నుంచి వచ్చేనెల 3వరకు వెబ్‌ఆప్షన్లను ఎంపిక చేసుకోవాలని తెలిపారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

హన్వాడ, జూలై 25 : రైతుబీమా కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కిరణ్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 59ఏండ్లలోపు వయస్సు గల వారు ఆగస్టు 4వరకు ఏఈవోలకు దరఖాస్తులు అందించాలని పేర్కొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలి

మక్తల్, జూలై 25 : రైతుబంధు నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ మాజీ ఎంపీటీసీ ఆసిరెడ్డి అన్నారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ రైతుబంధు పథకం అమలు చేసి, పంట సాగు చేసుకునే సమయానికి పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాలో జమ చేసేవారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రేవంత్‌రెడ్డి సర్కార్ రైతులకు పెట్టుబడి సాయం అందించకపోవడంతో అప్పులు తెచ్చి సాగుచేయాల్సిన దుస్థితి నెలకొన్నదన్నారు.

అ